ఎన్నికల బాండ్ల స్కీమ్

రాజ్యాంగ విరుద్ధం

సంచలన తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం


అన్నీ పార్టీలు తీర్పును స్వాగతిస్తున్న వైనం



మరి కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలో అధికార బీజేపీ తో పాటు దేశంలోని అన్ని రాజకీయపార్టీలకు షాక్ ఇచ్చింది సుప్రీం కోర్టు . రాజకీయ పార్టీలకు విరాళాలపై కీలకమైన తీర్పు ఇచ్చింది. మోడీ ప్రభుత్వం 2017లో తెచ్చిన ఎలక్టోరల్ బాండ్స్ చెల్లవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ ఎన్నికల బాండ్ పథకం రాజ్యాంగ విరుద్ధామని చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏకగ్రీవ తీర్పును వెలువరించింది. వెంటనే ఈ బాండ్స్ ఇష్యు ఆపేయాలని బ్యాంకులకు ఆదేశాలిచ్చింది. అసలు ఈ ఎలక్టోరల్ బాండ్స్ అంటే ఏమిటి? వీటిని ఎప్పుడు మనుగడలోకి తెచ్చారు? ఈ బాండ్స్ ఎవరు తీసుకోవచ్చు? ఎలక్టోరల్ బాండ్స్ ఎందుకు సుప్రీం కోర్టు నిలిపివేసింది? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు వివరంగా తెలుసుకుందాం.

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఎలక్ట్రోల్ బాండ్స్ పై సుప్రీం ఇచ్చిన తీర్పు ముందే చెప్పినట్టు అధికార బీజేపీతో పాటు దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు షాక్ ఇచ్చినట్టే. అన్నిటికన్నా బీజేపీకి ఇది పెద్ద దెబ్బగానే చూడొచ్చు. సరిగ్గా ఎన్నికల సమయంలో ఇలా నిధులకు బ్రేక్ పడటం రాజకీయ పార్టీలకు ఇబ్బందులను తీసుకువస్తుందనడంలో సందేహం లేదు. అంతేకాదు.. ఇప్పుడు నిధులను సమకూర్చుకోవడం చాలా కష్టంగా మారే పరిస్థితి ఉంది. ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఏమిటంటే.. సుప్రీం కోర్టు 2018 నుంచి విరాళాలు ఇచ్చిన వారి పూర్తి వివరాలు ఈసీకి ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే విరాళాల వివరాలన్నింటినీ వెబ్సైట్ లో పెట్టాలని స్పష్టం చేసింది. ఇప్పుడు ఇలా చేయడం ద్వారా ఇన్నేళ్ళుగా విరాళాలు ఇచ్చినవారి వివరాలన్నీ బయటకు వస్తాయి. ఇది బీజేపీ ప్రభుత్వానికి పెద్ద చిక్కులు తెచ్చే అవకాశాలు లేకపోలేదు. పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చిన వారి పేర్లు బహిర్గతం కావడం ద్వారా మొత్తం వ్యవస్థలో పెద్ద కుదుపు వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అనీ. దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేయాలని విస్పష్టంగా పేర్కొంది. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అనీ.. ఈ బాండ్ల జారీ అర్టికల్ (19(1)(ఏ) ఉల్లంఘన తో పాటు సమా చార హక్కు చట్ట పరిధిలో తగిన సమాచారం తెలుసుకునే హక్కును కాలరాస్తోందని ధర్మాసనం పేర్కొంది. అలాగే ఈ ఎలక్టోరల్ బాండ్లు ప్రాథమిక హక్కులను హరిస్తుందని చెప్పింది. ఈ విధానంలో రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం క్విడ్ప్రోకు దారి తీస్తుందని కోర్టు అభిప్రాయపడింది. విరాళాల దాతలను గోప్యంగా ఉంచడం చట్ట విరుద్ధమని పేర్కొన్న ధర్మాసనం బ్లాక్ మనీని అరికట్టేందుకు ఇది మార్గం కాదని చెప్పింది. నల్లధనం నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలు చాలా ఉన్నాయని చెప్పింది సుప్రీం కోర్టు.



ఎలక్టోరల్ బాండ్స్ అంటే ఏమిటి..?

ఇంతకీ, ఎన్నికల బాండ్లు అంటే ఏమిటి అని చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఎలక్టోరల్ బాండ్ అంటే కరెన్సీ నోటులా రాయబడిన ఒక బాండ్ మాత్రమే.. భారత్ కు చెందిన వ్యక్తులు, సంస్థలు, సంస్థల తరపున రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి ఈ బాండ్లను ఉపయోగించవచ్చు అన్నమాట. దీనిని కేంద్ర ఆర్థిక మంత్రి 2017-18 బడ్జెట్ లో మొదటి సారి ప్రవేశ పెట్టారు. ఈ ఎలక్టోరల్ బాండ్స్ రాజకీయ పార్టీలకు ఇవ్వడానికి ఒక ఆర్థిక పరికరంగా పని చేస్తుంది. అయితే, ఈ బాండ్ల అమ్మకాలు 2018 మార్చి 1 నుంచి 10వ తేదీ వరకు జరిగాయి. ఇక, ఈ ఎలక్టోరల్ బాండ్లపై బ్యాంకు ఎలాంటి వడ్డీని చెల్లించదు.. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఎలక్టోరల్ బాండ్లను జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ మొదటి 10 రోజులలో కొనుగోలు చేసే ఛాన్స్ ఉంటుంది.కాగా, ఎలక్టోరల్ బాండ్లను 1000 రూపాయల నుంచి 10,000 రూపాయలు, లక్ష రూపాయలు, కోటి రూపాయల వరకు గుణిజాలలో కొనుగోలు చేయవచ్చు. ఈ బాండ్లు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలలో మాత్రమే అందు బాటులో ఉంటాయి. ఇక, ఎలక్టోరల్ బాండ్లను కేవైసీ ధృవీకరించిన ఖాతాదారులు మాత్రమే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఈ బాండ్స్ కొనుగోలు చేసిన తేదీ నుంచి 15 రోజులలోపు కంట్రిబ్యూటర్లు ఈ బాండ్లను తమకు నచ్చిన పార్టీకి అందించాల్సి ఉంటుంది. కాగా, రాజకీయ పార్టీలు ఈ బాండ్ను బ్యాంకులో ధృవీకరించబడిన ఖాతా ద్వారా మాత్రమే నగదు చేస్తుంది. అయితే, బాండ్స్ పై దాత పేరు ఉండదు దాని వివరాలు బ్యాంకు దగ్గర గోప్యంగా ఉంటాయి.

అర్హతలు ఏమిటి?

ఈ ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్ ద్వారా విరాళాలను స్వీకరించడానికి అర్హతలు ఏమిటనే విషయాన్నీ పరిశీలిద్దాం. ప్రజాప్రాతినిధ్యం చట్టం, 1951 (43) సెక్షన్ 29ఏ కింద రాజకీయ పార్టీ రిజిస్టర్ అయి ఉండాలి. లోక్సభ లేదా అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీ బ కనీసం ఒక్క శాతం ఓటు షేరు సాధించాలి. ఎన్నికల సంఘం ధృవీకరించిన ఎకౌంట్ రాజకీయ పార్టీ కలిగి ఉండాలి. ఇలా అన్ని అర్హతలు ఉన్న పార్టీలు ఎలక్టోరల్ బాండ్స్ తీసుకోవడానికి వీలవుతుంది.

మూడు రకాలుగా వచ్చే విరాళాలు

రాజకీయ పార్టీలకు మూడు రకాలుగా నిధులు సమకూరుతుంటాయి.



వ్యక్తులు ఇచ్చే విరాళాలు. ఇలా వ్యక్తులు ఇచ్చే విరాళాలను రూ.20 వేలకుపైగా ఉంటే పార్టీలు వెల్లడించాల్సి ఉంటుంది. రెండోది ప్రువెడెన్షియల్ ట్రస్ట్ బాండ్లు. ఇది మధ్యస్తంగా చెబుతారు. ఒక వ్యక్తి లేదా సంస్థ ప్రుడెన్షియల్ ట్రస్ట్కు విరాళం ఇవ్వవచ్చు. ఇలాంటివన్నీ సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలకు ఎక్కువగా వెళుతుంటాయి. మూడోది ఎలక్టోరల్ బాండ్లు. సంస్థ లేదా వ్యక్తి స్టేట్ బ్యాంక్లో ప్రాథమిక వివరాలు చెప్పి ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి పార్టీలకు ఇస్తారు. ఈ విరాళం ఎవరిచ్చారన్నది పార్టీలు ప్రకటించాల్సిన అవసరం లేదు. అంటే బ్లాక్ మనీ మొత్తం రాజకీయ పార్టీలకు ఈ రూపంలో వెళ్లేందుకు అవకాశం ఉంది. దీన్నే ప్రస్తుతం సుప్రీంకోర్టు తప్పుబట్టింది.

ఎలక్టోరల్ బాండ్లకు ఎంతో ప్రాచుర్యం..

ఎలక్టోరల్ బాండ్లు ప్రవేశపెట్టిన మూడేళ్లలోనే అత్యంత ప్రజాదరణ పొందాయి. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రాజకీయ పార్టీల ఆదాయం సగానికి పైగా పెరిగింది. 2017-19, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు 2760.20 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇక బీజేపీకి ఈ బాండ్స్ ద్వారా అత్యధిక విరాళాలు వచ్చాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా.. బీజేపీకి అందిన విరాళాలు రూ.1917 కోట్లు. అదేవిధంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2120 కోట్ల విరాళాలు వచ్చాయి.


ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..?

ఎలక్టోరల్ బాండ్లు విరాళంగా ఇచ్చే దాతల పేరు రహస్యంగా ఉంచడం అదేవిధంగా ఎన్నికల సంఘానికి విరాళాల వివరాలను చెప్పనవసరం లేకపోవడం విషయంలో విపక్షాలు అదేవిధంగా రాజకీయ పరిశీలకులు అభ్యంతరం చెప్పారు. అంతేకాకుండా ఈ విరాళాల లెక్కలు ఆదాయపు పన్ను లెక్కల్లోకి రావు. అలాగే పన్ను చెల్లింపుదారుల ద్వారా ఎస్బీఐకి కేంద్రం కమిషన్లు చెల్లించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎన్నికల కమిషన్ ఏమంటుంది?

ఎలక్టోరల్ బాండ్సను ఈసీ కూడా వ్యతిరేకిస్తోంది. ఎన్నికల సంఘం చట్టంలోని సవరణను పునఃపరిశీలించాలని 2017 మేలో కేంద్రానికి లేఖ కూడా రాసింది. విరాళాలు గోప్యంగా ఉంచడం ప్రజాప్రాతినిధ్యం చట్టం సెక్షన్ 28%దీ% నిబంధనల ఉల్లంఘన అని స్పష్టం ఈసీ స్పష్టం చేస్తోంది.

తీర్పు అధ్యయనం చేస్తున్నాం



తీర్పును తాము అధ్యయనం చేస్తున్నామని కేంద్ర సర్కారు వర్గాలు తెలిపాయి. ఈవిషయంలో తమ ఎదుట ఉన్న ఆప్షన్లను ప్రస్తుతం కేంద్రం నిశితంగా పరిశీలిస్తోందని పేర్కొన్నాయి. రాజకీయ పార్టీలకు అందే విరాళాల లెక్కలను ప్రభుత్వం పరిధిలోకి తేవడంతో పాటు నల్లధనాన్ని విరాళాలుగా అందించే సంప్రదాయానికి అడ్డుకట్ట వేసే సదుద్దేశంతోనే ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తెచ్చామనే అభిప్రాయంతో కేంద్రం పెద్దలు ఉన్నట్లు సమాచారం. రాజకీయ విరాళాలను అందించే దాతల పేర్లను బహిర్గతం చేస్తే బ్యాంకింగ్ చట్టాలకు తూట్లు పొడిచినట్లు అవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు అభిప్రాయపడుతున్నాయట. సార్వత్రిక ఎన్నికలు సమీపించిన ప్రస్తుత తరుణంలో సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమైన బిల్లును తీసుకొచ్చే సాహసానికి కేంద్ర సర్కారు సిద్ధపడకపోవచ్చని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

ఏపీ వాటా రూ.529 కోట్లు

ఎలక్టోరల్ బాండ్ల విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన వైసీపీ, తెలుగుదేశం పార్టీలకు ఇప్పటి వరకు రూ.529.04 కోట్లు బాండ్ల రూపంలో వచ్చాయి. ఇందులో అధికార వైసీపీకి రూ.382.44 కోట్లు రాగా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి రూ.146 కోట్లు వచ్చాయి. ఇందులో సంవత్సరాలు వారీగా తీసుకుంటే 2017-18లో ఇరు పార్టీలకు రూపాయి కూడా రాలేదు. 2018-19 ఏడాదిలో వైసీపీకి రూ.99.84 కోట్లు రాగా, టీడీపీకి రూ.27.5 కోట్లు, 2019-20లో వైసీపీకి రూ.74.35 కోట్లు, టీడీపీకి రూ.81.6 కోట్లు, 2020-21లో వైసీపీకి రూ.96.25 కోట్లు రాగా, టీడీపీకి రూపాయి కూడా రాలేదు. 2021-22లో వైసీపీకి రూ.60, టీడీపీకి రూ.3.5 కోట్లు, 2022-23లో వైసీపీకి రూ.52 కోట్లు రాగా, టీడీపీకి రూ.34 కోట్లు వచ్చాయి. మొత్తంగా గడిచిన ఆరేళ్లలో (2023 వరకు) వైసీపీకి రూ.382.44 కోట్లు బాండ్ల రూపంలో రగా, టీడీపీకి రూ.146 కోట్లు వచ్చాయి.

